క్లుప్తంగా

వాహన తనిఖీలు


తెర్లాంలో వాహన తనిఖీ చేస్తున్న పోలీసులు

తెర్లాం: వాహనాలకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు లేకపోతే చర్యలు తీసుకునేందుకు వెనుకాడేది లేదని తెర్లాం ఎస్ఐ సాగర్‌బాబు హెచ్చరించారు. మండల కేంద్రంలో వాహనాల తనిఖీలు గురువారం నిర్వహించారు. అటువైపుగా వచ్చే వాహనాలను ఆపి, వాహనాలకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు ఉన్నవీ, లేనివీ తనిఖీ చేశారు. ద్విచక్ర వాహన చోదకులకు లైసెన్స్ లేకపోయినా, హెల్మెట్ ధరించకపోయినా అపరాధ రుసుం విధించారు. ద్విచక్ర వాహనాలు నడిపేవారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, లైసెన్స్ కలిగి ఉండాలని సూచించారు. మితిమీరిన వేగంతో వాహనాలు నడపవద్దన్నారు. తనిఖీల్లో హెచ్‌సీ నాగేశ్వరరావు, తదితరులు ఉన్నారు.

రుణాలు మంజూరు చేయండి


మాట్లాడుతున్న లీడ్‌బ్యాంకు మేనేజర్ రమణమూర్తి

బొబ్బిలిరూరల్: మహిళా పొదుపు సంఘాలకు బ్యాంకులు విరివిగా రుణాలు మంజూరు చేయాలని లీడ్‌బ్యాంకు మేనేజర్ రమణమూర్తి కోరారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో జేఎంఎల్‌బీసీ సమావేశం గురువారం జరిగింది. ఆయన మాట్లాడుతూ పొదుపు సంఘాల రుణాలకు సంబంధించి ఎప్పటికప్పుడు ఆడిట్ చేయాలన్నారు. రైతులకు సబ్సిడీపై రుణాలు అందజేసి, తద్వారా వారికి మనోధైర్యం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో నాబార్డు ఏజీఎం నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

అభినందనలు


రాజాం: మిఠాయి తినిపించి, విద్యార్థిని వరలక్ష్మిని అభినందిస్తున్న ప్రధానోపాధ్యాయుడు వసంతరావు


వంగర: నవదీప్‌ను అభినందిస్తున్న ఎంఈవో జగదీశ్వరి

రాజాం/వంగర: మండలాల్లోని పలు పాఠశాలల్లో పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పలువురు విద్యార్థులను పాఠశాల సిబ్బంది, విద్యాశాఖ అధికారులు గురువారం అభినందించారు. 576 మార్కులు సాధించిన రాజాం మండలంలోని కంచరాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని కె.వరలక్ష్మిని ప్రధానోపాధ్యాయుడు వసంతరావు, మరో 576 మార్కులు సాధించిన వంగర మండలం, అరసాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి అడ్డా నవదీప్‌ను ఎంఈవో–2 ఖండాపు జగదీశ్వరిలు అభినందించి, ప్రోత్సహించారు. ఉన్నత చదువులు కూడా బాగా చదివి జీవితంలో మంచి స్థాయిలో స్థిరపడాలని ఆకాంక్షించారు.

పశువుల అక్రమ రవాణాపై నిఘా


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఆర్డీవో రామ్మోహనరావు

బొబ్బిలి: పశువుల అక్రమ రవాణాపై నిఘా ఉంచాలని ఆర్డీవో జేవీఎస్ రామ్మోహనరావు సూచించారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో డివిజనల్ జంతు సంక్షేమ కమిటీ సమావేశం గురువారం జరిగింది. ఆయన మాట్లాడుతూ భౌగోళిక జీవవైవిధ్యానికి జంతువులను సంరక్షించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. ఎటువంటి అనుమతులు లేకుండా మూగజీవాలు తరలించే వారిపై కేసులు నమోదు చేయాలన్నారు. ఆలయాలకు 300 మీటర్ల లోపు జంతుబలులు జరగకుండా చూడాలన్నారు. స్థానిక దాడితల్లి మందిరం వద్ద జంతుబలులు నిషేధిస్తూ హెచ్చరిక బోర్డులు పెట్టాలన్నారు. జంతువుల పట్ల దయ, ప్రేమ కలిగేలా పాఠశాలల్లో కైండ్‌నెస్ క్లబ్‌లు ఏర్పాటు చేయాలన్నారు. ఒడిశా రాష్ట్రం సహా పార్వతీపురం మన్యం జిల్లా నుంచి జిల్లాలోకి అక్రమంగా జంతువుల తరలింపు జరగకుండా చర్యలు తీసుకుంటున్నామని డీఎస్పీ భవ్యారెడ్డి తెలిపారు. పెదమానాపురం సంతపై కూడా దృష్టిసారించి ఇతర ప్రాంతాల నుంచి పశువులను తరలించకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఏపీ గోసంరక్షణ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు లోగిశ రామకృష్ణ మాట్లాడుతూ పశువులను అక్రమంగా తరలించే వాహనాలను సీజ్ చేసి, కేసులు నమోదు చేయాలన్నారు. స్వాధీనం చేసుకున్న పశువులను సంరక్షించేందుకు గోశాలలకు తరలించాలన్నారు. అనంతరం పశు సంరక్షణకు సూచనలు తెలిపే క్యాలెండర్లు, పోస్టర్లును ఆవిష్కరించారు. కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎల్.విష్ణు, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ లావణ్య, మండల పరిషత్ ఏవో అప్పారావు, దత్తిరాజేరు ఈవోపీఆర్‌డీ వాణిశ్రీ తదితరులు పాల్గొన్నారు.

అక్కరకురాని ఉపాధి

- అవసరానికి ఉపయోగపడని ఉపాధి పథకం
- కొన్ని వారాలుగా చేతికందని వేతనాలు
- రెండు పూటలా పనిచేసినా గిట్టుబాటు కాని వేతనం
- నియోజకవర్గంలో 2,827 కుటుంబాలు వలసబాట
- ఆదుకోని డబుల్ ఇంజిన్ సర్కారు


జీడిమామిడి తోటలో ఉపాధి పనులు చేస్తున్న వేతనదారులు (ఫైల్)

రామభద్రపురం: గ్రామీణ ప్రాంతాల నుంచి ఇతర ప్రాంతాలకు నిరుపేద ప్రజల వలసలను అరికట్టడమే లక్ష్యంగా తీసుకువచ్చిన ఉపాధి హామీ పథకం.. ప్రస్తుతం ఎవరికీ అంతగా ఉపయోగపడడం లేదు. వారాల తరబడి కష్టపడి పనిచేస్తున్నా వేతనాలు ఇవ్వడం లేదు. దీనికితోడు రోజుకు రెండు పూటలా శ్రమించినా గిట్టుబాటు అయ్యే వేతనం రావడం లేదు. దీంతో గ్రామీణులు వలసబాట పడుతున్నారు. దీనికి ఇటీవల రాష్ట్రంలో ప్రభుత్వం చేసిన పీ4 సర్వే గణాంకాలే నిదర్శనంగా నిలుస్తున్నాయి. ఇంత జరుగుతున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించకపోవడం పట్ల సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

వేతన పెంపు హామీ ఊసే లేదు..

గ్రామాల్లోని కూలీలకు ఉన్నచోట పని కల్పించి వారికి ఉపాధి హామీ ఇవ్వాలన్న సదుద్దేశంతో అప్పటి యూపీఏ ప్రభుత్వం ఎన్‌ఆర్‌ఈజీఎస్(జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం)ను ప్రవేశపెట్టింది. ప్రస్తుతం ఈ పథకాన్ని నిర్వీర్యం చేసే దిశగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయి. కాలంతో పాటు నిత్యావసర సరుకుల ధరలు కూడా భారీగా పెరగడంతో రోజువారీ వచ్చే వేతనం పెంచాలి.. వచ్చే వేతనం సరిపోవడం లేదన్న వాదనలు వేతనదారుల నుంచి వినిపిస్తున్నాయి. అయినా ప్రభుత్వాలు ఏమాత్రం స్పందించడం లేదు. ఎన్నికల ముందు కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్న రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం తాము ఎన్నికల్లో గెలిస్తే ఉపాధి కూలీలకు వేతనం పెంచుతామని హామీ ఇచ్చింది. తీరా ఓట్లు దండుకుని గద్దెనెక్కిన తర్వాత ఆ హామీ అమలు ఊసే లేదు. ప్రభుత్వం ఏర్పాటు జరిగి 10 నెలలు కావస్తున్నా ఇచ్చిన హామీ నెరవేర్చకపోవడంతో శ్రామికులకు వలసబాట తప్పడం లేదు.

మండలాల వారీగా వలసబాట పట్టిన కుటుంబాల వివరాలు..		
మండలం	ఇతర జిల్లాలకు వలసలు	ఇతర రాష్ట్రాలకు వలసలు
రామభద్రపురం	208	278
బొబ్బిలి	85	565
బాడంగి	101	501
తెర్లాం	230	859

రాష్ట్రం వీడి ఇతర రాష్ట్రాలకు..

బొబ్బిలి నియోజకవర్గంలోని 2,827 కుటుంబాలు వలసబాట పట్టగా వారిలో ఈ రాష్ట్రంలోని ఇతర జిల్లాలకు వలసపోయిన వారు 624 కుటుంబాల వారు ఉన్నారు. రాష్ట్రం వీడి ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లిన వారిలో 2,203 కుటుంబాల వారు ఉన్నారు. ఎక్కువ మంది తెలంగాణ, చెన్నై, కర్ణాటక, మహారాష్ట్రలకు వలసపోయినట్లు ఇటీవల కూటమి ప్రభుత్వం గ్రామగ్రామాన నిర్వహించిన సర్వే గణాంకాలు చెబుతున్నాయి. ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు వ్యక్తులు కలిసి పనిచేస్తే ప్రభుత్వ నిబంధనల ప్రకారం రూ.300 వేతనం కూడా రాకపోవడంతో కుటుంబాన్ని పోషించుకోలేని దుస్థితిలో పలు కుటుంబాలు ఉన్నాయి. రూ.300తో పిల్లల చదువులు, కుటుంబ పోషణ కష్టమవుతోందని వేతనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎక్కువ వేతనానికి వలస వెళ్తే తప్ప పిల్లల చదువులు, పెళ్లిళ్లు చేయలేకపోతున్నామని చెబుతున్నారు.


అధికులు వలసబాట పట్టిన కొండకెంగువ గ్రామం ఇదే..

కూలి డబ్బులు గిట్టుబాటు కావడం లేదు..



నేను ప్రతిరోజూ ఉపాధి హామీ పనికి వెళ్తున్నారు. రోజుకు కేవలం రూ.150 మాత్రమే వస్తోంది. చేసిన పనికి ఈ కూలి డబ్బులు గిట్టుబాటు కావడం లేదు. 8 వారాల నుంచి ఆ డబ్బులు కూడా పడడం లేదు. కుటుంబాన్ని పోషించుకోవడం కష్టంగా మారింది. ఇతర రాష్ట్రాలకు వెళ్తే ఉపాధి కూలి కన్నా ఎక్కువ వస్తుందని వెళ్లేందుకు సిద్ధమవుతున్నాం.

–బొంగు అనసూయ, నాయుడువలస గ్రామం

ప్రతిఒక్కరికీ పని కల్పిస్తున్నాం..



జాబ్‌కార్డు ఉన్న ప్రతిఒక్కరికీ ఉపాధి పనులు కల్పిస్తున్నాం. రెండు పూటలా కొలతల ప్రకారం పనిచేస్తే రోజుకు రూ.300 పడుతోంది. కొంతమందికి కొన్ని వారాలుగా డబ్బులు అందని పరిస్థితి అయితే వాస్తవమే.

–త్రినాథరావు, ఏపీవో, రామభద్రపురం

నైతిక విలువలు పెంపొందించాలి

రాజాం సిటీ: చిన్నారుల్లో నైతిక విలువలు పెంపొందించాలని, దీనికి ప్రజ్ఞా తరగతులు ఎంతగానో దోహదపడతాయని వికాస తరంగిణి సెంట్రల్ కో–ఆర్డినేటర్ టీటీవీ రమణమూర్తి అన్నారు. స్థానిక ప్రశాంతినగర్‌లోని వికాస తంగిణి కార్యాలయంలో ప్రజ్ఞ తరగతులు గురువారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ మే 3వ తేదీ వరకు జరగనున్న ఈ తరగతులకు 6 నుంచి 9వ తరగతి చదువుతున్న విద్యార్థులు హాజరుకావచ్చన్నారు. ప్రజ్ఞ దైనందిన శ్లోకాలు, సప్త ఋషుల చరిత్ర, శ్రీమద్రామాయణం, మహాభారతము, భాగవతం, శ్రీమద్భగవద్గీత కావ్యాలను పరిచయం చేయడంతో పాటు యోగాసనాలు నేర్పించనున్నామన్నారు. ప్రతిరోజూ ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు తరగతులు ఉంటాయన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ప్రజ్ఞ వికాస్ సమన్వయకర్త మురపాక గణేష్ పాల్గొన్నారు.

వేసవి శిక్షణా తరగతులు ప్రారంభం


రాజాం: శిక్షణా తరగతులు గూర్చి వివరిస్తున్న సాయిప్రశాంత్‌కుమార్

రాజాం: స్థానిక జవహర్‌లాల్ బాలభవన్‌లో వేసవి శిక్షణా తరగతులు గురువారం ప్రారంభమయ్యాయి. పట్టణానికి చెందిన రెడ్‌క్రాస్ చైర్మన్ కొత్త సాయిప్రశాంత్‌కుమార్ ఈ శిక్షణను ప్రారంభించి, కాసేపు మాట్లాడారు. విద్యార్థులకు వేసవిలో వివిధ కళలపై శిక్షణ ఇచ్చే ఈ మంచి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. నెల రోజుల పాటు నృత్యం, సంగీతం, తబలా, ఆర్ట్స్, క్రాఫ్ట్, టైలరింగ్ వంటి సృజనాత్మక కళల్లో తర్ఫీదు ఇవ్వనున్నామన్నారు. కార్యక్రమంలో బాలభవన్ డైరెక్టర్ ఎస్.రమేష్, మ్యూజిక్, డ్రాయింగ్ ఉపాధ్యాయులు పీవీఎల్ రత్నం, వి.ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి: స్థానిక పట్టణంలోని వాసు జూనియర్ కళాశాలలో వేసవి విద్యా, వైజ్ఞానిక, వినోద కార్యక్రమం గురువారం ప్రారంభించారు. జనవిజ్ఞాన వేదిక, గ్రీన్‌బెల్ట్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ శిబిరంలో విద్యార్థుల్లోని సృజనాత్మక శక్తులు వెలికితీసేలా వివిధ కళల్లో శిక్షణ ఇవ్వడం జరుగుతుందని ఎంఈవో గొట్టాపు వాసు తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో గ్రీన్‌బెల్ట్ సొసైటీ అధ్యక్షుడు ఎస్వీ రమణమూర్తి తెలిపారు.


బొబ్బిలి: విద్యార్థులను ఉద్దేశించి, మాట్లాడుతున్న నిర్వాహకులు

నిర్మానుష్యం



వేసవి ఎండలు ప్రజలను బెంబేలెత్తిస్తున్నాయి. రోజురోజుకూ ఎండల తీవ్రత అధికమవుతుండడంతో ఇంటి నుంచి బయటకు వచ్చేందుకు ఎవరూ ఇష్టపడడం లేదు. ఈ నేపథ్యంలో సంతకవిటి మండలంలోని బాడంగి మెయిన్ రోడ్డు గురువారం నిర్మానుష్యంగా దర్శనమిచ్చింది. రోజూ 40 డిగ్రీల సెల్సియస్‌కు పైగా ఉష్ణోగ్రత నమోదవుతుండడంతో ఇంటి వద్దనే ఉండేందుకు అందరూ ఇష్టపడుతున్నారు. ఈ నేపథ్యంలో ఇలా జనాలు లేని రోడ్లు, వీధులు కనిపిస్తున్నాయి.

–బాడంగి

దరఖాస్తు చేసుకోండి

బొబ్బిలి: భవన నిర్మాణాలకు అనుమతుల జారీకి లైసెన్స్ కోసం సెల్ఫ్ సర్టిఫికేషన్ స్కీమ్ కింద దరఖాస్తు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి ఓ ప్రకటనలో గురువారం కోరారు. ఆసక్తి ఉన్న వారు దరఖాస్తు చేసుకుంటే లైసెన్స్‌లు జారీ చేయడం జరుగుతుందన్నారు.

మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు

రాజాం సిటీ: స్థానిక పాలకొండ రోడ్డులోని బాబానగర్ శివం మందిరం సత్యసాయి భక్తులు గురువారం మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేశారు. రాజాంలో జరిగే వారపు సంతకు వచ్చే ప్రజల దాహార్తి తీర్చేందుకు ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశామని వారు తెలిపారు.

అన్నదానం

రేగిడి: స్థానిక విశ్వసాయి మందిరం వద్ద గురువారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సత్యసాయి ఆరాధన దినోత్సవంలో భాగంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో స్థానికులతో పాటు పరిసర గ్రామాల ప్రజలంతా పాల్గొని, అన్నప్రసాదం స్వీకరించారు. కార్యక్రమంలో సత్యసాయి భజనమండలి కన్వీనర్ మామిడి శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధిలో పంచాయతీరాజ్ వ్యవస్థే కీలకం

మండల పరిషత్ కార్యాలయాల్లో జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. అధికారులు, ప్రజాప్రతినిధులంతా ఈ కార్యక్రమానికి హాజరై, గాంధీజీ, అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. గ్రామాల అభివృద్ధిలో పంచాయతీరాజ్ వ్యవస్థ చాలా కీలకమైనదని, ప్రతిఒక్కరం గ్రామాల ప్రగతికి కృషి చేయాలని వక్తలు కోరారు. అనంతరం పంచాయతీరాజ్ వ్యవస్థ బలోపేతానికి కృషి చేసిన పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులను సన్మానించారు.

–రాజాంసిటీ, రేగిడి, సంతకవిటి, తెర్లాం, బాడంగి


రేగిడి: ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ అప్పలనరసమ్మ, వైస్ ఎంపీపీలు అచ్చెన్నాయుడు, జగన్మోహనరావును సన్మానిస్తున్న అధికారులు


సంతకవిటి: గాంధీజీ, అంబేడ్కర్ చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు


రాజాం సిటీ: ఎంపీపీ సులోచనను సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు


తెర్లాం: ఎంపీడీవో కార్యాలయంలో గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న జెడ్పీటీసీ ప్రతినిధి రామారావు, ఎంఈవో త్రినాథరావు


బాడంగి: విజయనగరం జిల్లా పరిషత్ కార్యాలయంలో ఉత్తమ ఎంపీడీవోగా ఎంపికైన రామకృష్ణను సన్మానిస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

కల్వర్టు బాగుచేయరూ?



తెర్లాం మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలోని కల్వర్టు పూర్తిగా ధ్వంసమైంది. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు వెళ్లే దారిలోనే ఈ పాడైన కల్వర్టు ఉండడంతో అటువైపుగా వెళ్లే వారు ఇబ్బందులు పడుతున్నారు. కొంతమంది వాహనదారులు అదుపుతప్పి కల్వర్టులో పడిపోవడంతో గాయాలపాలైనట్లు స్థానికులు చెబుతున్నారు. మరో ప్రమాదం జరగకుముందే కల్వర్టు బాగు చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు.

–తెర్లాం

సమ్మెను విజయవంతం చేయండి



కేంద్ర ప్రభుత్వం కొత్తగా చేసిన లేబర్ చట్టాలను రద్దును డిమాండ్ చేస్తూ మే 20వ తేదీన చేపట్టబోయే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని బొబ్బిలి పట్టణ కలాసీ సంఘం కార్యదర్శి దంతులూరి వర్మ కోరారు. ఇదే విషయమై ఆయన బొబ్బిలి సీఐటీయూ కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించి, మాట్లాడారు. కార్మికహక్కులు హరించేలా ఉండే ఈ చట్టాల అమలుతో భవిష్యత్‌లో మరిన్ని ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందన్నారు. సమ్మె కన్నా ముందుగా మే 11వ తేదీన బొబ్బిలిలో కార్మిక సంఘాలతో సదస్సు నిర్వహిస్తున్నామని, కార్మిక సంఘాల నాయకులు, కార్మికులంతా హాజరుకావాలని కోరారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పి.శంకరరావు, ఇఫ్టూ జిల్లా అధ్యక్షుడు ఎం.గోపాలం, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.సాయికృష్ణ, సీపీఎం నేత ఎం.గోపాలం పాల్గొన్నారు.

–బొబ్బిలి

మలుపు.. ప్రమాదానికి పిలుపు!



రేగిడి మండలం, చిన్నశిర్లాం గ్రామ సమీపంలోని రోడ్డు మలుపు ప్రమాదకరంగా ఉంది. రోడ్డు వంపు భారీగా ఉండడంతో అవతలి వైపు నుంచి ఎవరు వస్తున్నారో దగ్గరకు వెళ్తే తప్ప కానరాని పరిస్థితి. దీంతో తరచూ ప్రమాదాలు జరిగి పలువురు మృత్యువాత పడుతున్నారు. ఇటీవల ఓ లారీ చెట్టును ఢీకొని డ్రైవరు మృతి చెందారు. హెచ్చరిక బోర్డులు గానీ స్టాపర్లు గానీ ఏర్పాటు చేయకపోవడం వల్లే దుర్ఘటనలు జరుగుతున్నాయని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి, రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

–రేగిడి

ఉగ్రదాడి నిరసిస్తూ శాంతి ర్యాలీ


రామభద్రపురం: ఎంపీడీవో కార్యాలయం నుంచి ర్యాలీగా వెళ్తున్న సచివాలయ సిబ్బంది


బొబ్బిలిలో ఉగ్రదాడిని ఖండిస్తూ రాజ్యాంగ పరిరక్షణ వేదిక సభ్యుల నిరసన

రామభద్రపురం: కశ్మీర్‌లోని పహల్గామ్‌లో పర్యాటకులపై ఉగ్రవాదులు చేసిన దాడిని నిరసిస్తూ మండల కేంద్రంలో సచివాలయ సిబ్బంది గురువారం శాంతి ర్యాలీ నిర్వహించారు. ఎంపీడీవో కార్యాలయం నుంచి గాంధీబొమ్మ సెంటరు వరకు జరిగిన ఈ ర్యాలీలో పాల్గొన్న వారంతా ఉగ్రదాడిని ఖండిస్తూ నినాదాలు చేశారు. అనంతరం బైపాస్ రోడ్డులోని గాంధీబొమ్మ సెంటర్‌లో మానవహారం చేపట్టి ముష్కరుల దాడిలో ప్రాణాలు వదిలిన వారి ఆత్మకు శాంతి చేకూర్చాలని ప్రార్థనలు చేశారు.

ముష్కరుల దాడి.. ఓ పిరికిపంద చర్య


డాక్టర్ తలే రాజేష్

రాజాం: కశ్మీర్‌లోని పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడి.. ముష్కరుల పిరికిపంద చర్య అని వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ అన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించి, ఆ దాడిని పార్టీ తరఫున తీవ్రంగా ఖండించారు. ఉగ్రదాడిలో మరణించిన వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నామన్నారు. దాడికి పాల్పడిన వారిపై కేంద్రం కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ముష్కరుల దాడి దృశ్యాలు మనసును కలచివేశాయని, త్వరలోనే ఈ ఘటనకు భారత్ దీటైన సమాధానం ఇస్తుందన్నారు. మనమంతా ఐక్యంగా ఉండి, బాధితులకు అండగా నిలవాలన్నారు.


బొబ్బిలి: మండల కేంద్రంలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ

బొబ్బిలి: కశ్మీర్‌లోని పహల్గామ్‌లో పర్యాటకులపై ఉగ్రమూకలు చేసిన దాడి దారుణమని, ఈ అమానవీయమైన చర్యను అందరూ ఖండించాలని రోటరీ క్లబ్, కారుణ్య ఫౌండేషన్, హిందూ పరివార్, రాజ్యాంగ పరిరక్షణ సమితి సంస్థల ప్రతినిధులు కోరారు. ఉగ్రదాడికి వ్యతిరేకంగా స్థానిక పట్టణ వీధుల్లో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆయా సంఘాల ప్రతినిధులు విజయగౌరి, శంకరరావు, ఇంతియాజ్, జి.శ్రీనివాసరావు, పి.శ్రీనివాసరావు, పి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.